క్లుప్తంగా

వైభవంగా శ్రీవారికి గరుడ వాహన సేవ



సత్తెనపల్లి: శ్రావణ మాసం శుద్ధ రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న అలివేలు మంగ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామికి సోమవారం రాత్రి స్నపన తిరుమంజనం శోభాయమానంగా జరిగింది. శ్యాము ఆచార్య రామానుజదాసన్ గరుడల్వార్ మూర్తికి విశేష పూజలు నిర్వహించారు. సర్వాలంకార భూషితుడైన శ్రీవారు తనకు అత్యంత ఇష్టమైన గరుడ వాహనంపై పుర వీధుల్లో దర్శనమిస్తూ భక్తులకు అభయ ప్రదానం చేశారు. ఏకాంత సేవా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి గరుడ ముద్ద, తీర్థ ప్రసాదాలు స్వీకరించి, స్వామివారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా శ్రీవారి కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వీఆర్వోకు అభినందనలు



అమరావతి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయిలో ఉత్తమ గ్రామ రెవెన్యూ అధికారిగా ఎంపికైన మల్లాది వీఆర్వో భవనగిరి శ్రీనివాస్‌ను మంగళవారం మల్లాది గ్రామంలో ప్రజాప్రతి నిధులు, గ్రామస్తులు అభినందించి, సన్మానించారు. క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెంపా జ్వాలా లక్ష్మీ నరసింహారావు శ్రీనివాస్‌ను సత్కరించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, నాయకుడు వెంపావాసు పాల్గొన్నారు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు



అమరావతి: మండల పరిధిలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు కంటి పరీక్షలను మంగళవారం లింగాపురం జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించినట్లు వైద్యులు పి.సుబ్బారావు తెలిపారు. సుమారు 54 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించామన్నారు. అందులో ఐదుగురిలో దృష్టి సమస్యలను గుర్తించి కళ్లజోళ్లకు సిఫార్సు చేశామన్నారు. ఉచితంగా అందజేస్తామని చెప్పారు. మరో ఇద్దరు విద్యార్థులకు కళ్లకలకను గుర్తించి మందులు పంపిణీ చేశామన్నారు. మండలంలో 2,357 మంది విద్యార్థుల్లో ఇప్పటి వరకు 56 మందికి కళ్లజోళ్లను సిఫార్సు చేశామని తెలిపారు. 121 మంది కంటి సమస్యలకు మందులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్సిడీతో రైతులకు మొక్కలు



రాజుపాలెం: ఉద్యాన శాఖ ద్వారా ఆయిల్ ఫాం వేసుకున్న రైతులకు పూర్తి సబ్సిడీతో మొక్కలు, అంతర పంటల సాగుకు ఆర్థిక సాయం వేల్యూ ఆయిల్ కంపెనీ ద్వారా రైతులకు అందజేస్తామని ఉద్యాన శాఖాధికారి డి.నవీన్ తెలిపారు. ఉప్పలపాడు గ్రామ పరిధిలో చల్లాపల్లి తండా సమీపంలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఉద్యానశాఖాధికారి రైతులతో మాట్లాడుతూ ఆయిల్ ఫాం వల్ల రైతులు ఎక్కువ ఆదాయం పొందుతారని, డ్రిప్ ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకులు రమేష్, వేల్యూ ఆయిల్ కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు

క్రోసూరు: మండలంలోని క్రోసూరు, పారుపల్లి, గుడిపాడు గ్రామాల్లో మంగళవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు మండల పశువైద్యుడే డాక్టర్ మల్లయ్య తెలిపారు. పశువైద్యశాల సిబ్బంది, గోపాల మిత్రలు మూడు బృందాలుగా ఏర్పడి వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. మొత్తం 1,200 పశువులకు టీకాలు వేసినట్లు వెల్లడించారు. పశుపోషకులు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాలను సద్వినియోగపరుచుకోవాలని మల్లయ్య కోరారు.

వ్యవసాయం ఏదీ?

ఖరీఫ్ పెట్టుబడి సాయం అందుతుందని ఆశ పడిన రైతులకు నిరాశే మిగిలింది. ఎన్నికల్లో రైతులకు పెట్టుబడి సాయం రూ. 20 వేలు అందజేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చి రెండు నెలలైనా ఆ ఊసే ఎత్తడం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన రైతు భరోసా పథకం పేరు ను అన్నదాత సుఖీభవగా పేరు మార్పు తప్ప.. పెట్టుబడి సాయం అందించ లేదని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఖరీఫ్‌కు ముందే రైతులకు సాయం
- కూటమి ప్రభుత్వంలో దక్కని భరోసా
- నియోజకవర్గంలో పంటల సాగుపై ప్రభావం
- అన్నదాత సుఖీభవ కోసం ఎదురు చూస్తున్న రైతులు



భీమవరంలో సాగవుతున్న పత్తి పంట

సత్తెనపల్లి: దేశానికి వెన్నెముక రైతు అంటారు. అలాంటి రైతుకు కూటమి ప్రభుత్వంలో అవస్థలు తప్పడం లేదు. ఖరీఫ్‌లో అరకొరగా కురుస్తున్న వర్షాలకు రైతులు సాగుకు సమాయత్తమవుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి రైతులకు ఎలాంటి సాయం అందడం లేదు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రైతులకు అన్నదాత సుఖీభవ పథకం పేరుతో ఏటా పెట్టుబడి సాయం రూ.20 వేలు అందిస్తానని కూటమి పార్టీ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చినా రైతుల గోడు పట్టించుకోవడం లేదు. సత్తెనపల్లి నియోజకవర్గంలో సత్తెనపల్లి, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో 33,917 హెక్టార్ల సాధారణ సాగు విస్తీర్ణం. ఇప్పటి వరకు నియోజకవర్గంలో 7,285 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేశారు. పత్తి, వరి, మిర్చి, కంది, మినుము తదితర పంటలు సాగుకు పూనుకున్నారు. ఇందులో చిన్న, సన్నకారు రైతులే ఎక్కువగా ఉన్నారు. అయితే ప్రభుత్వం పెట్టుబడి సాయంపై చర్యలు తీసుకోకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

నియోజకవర్గంలో గత ఐదేళ్లల్లో రైతు భరోసా లబ్ధి ఇలా

సంవత్సరం	రైతులు	లబ్ధి (రూ.కోట్లలో)
2019–20	38,623	51.66
2020–21	39,560	53.41
2021–22	37,891	51.15
2022–23	37,412	52.94
2023–24	41,131	46.14
మొత్తం	1,94,257	255.30

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇలా..

రైతులు పంటల సాగు కోసం ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏటా క్రమం తప్పకుండా రైతు భరోసా పథకాన్ని అమలు చేసేది. పీఎం కిసాన్ కింద రూ. 6 వేలు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ. 7,500 కలిపి ఏడాదికి రూ.13,500 రైతు ఖాతాలో నగదు జమ చేసేది. అంతే కాకుండా కౌలుకు సాగు చేసుకుంటున్న రైతులను ఆదుకోవాలని పెద్ద మనసుతో ఏడాదికి రూ రూ.13,500 జమ చేసి భరోసా కల్పించింది.

తప్పని ఎదురుచూపులు

ప్రస్తుతం రైతులు పంటలు సాగుకు పొలాలు సిద్ధం చేసుకుంటున్నారు. కొందరు ఇప్పటికే వివిధ పంటలు సాగు చేశారు. అడపా దడపా కురుస్తున్న వర్షాలకు రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. ఇలాంటి సమయంలో పెట్టుబడి సాయం అవసరం.

బదిలీల హడావుడి.. విధులకు డుమ్మా

ఖాళీగా దర్శనమిస్తున్న కార్యాలయాలు



ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న ఎంపీడీవో కార్యాలయం

ముప్పాళ్ళ: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలపై జీఓ విడుదల చేయడంతో అధికారులు బదిలీలపై శ్రద్ధ పెట్టారు. ఏకంగా ఉద్యోగ బాధ్యతలను విస్మరించి, రాజకీయ నేతల ఆశీస్సులు పొందే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. ఉద్యోగులంతా బదిలీల ప్రయత్నాల్లో ముమ్మరంగా ఉండటంతో కార్యాలయాలన్నీ బోసి పోతున్నాయి. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కేవలం ఇద్దరు అటెండర్లు మాత్రమే విధుల్లో ఉన్నారు. తాను నరసరావుపేటలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగే సమీక్ష సమావేశానికి హాజరయ్యానని, మిగిలిన సిబ్బందిలో జూనియర్ అసిస్టెంట్, కార్యాలయ ఏఓలు ఇద్దరూ సెలవుపై వెళ్లినట్లు ఎంపీడీఓ పి.పుట్టారెడ్డి తెలిపారు. సీనియర్ అసిస్టెంట్, టైపిస్టులు అనుమతితో ఎమ్మెల్యే ఆఫీసుకు వెళ్లారన్నారు. ఈఓపీఆర్డీ గురించి తనకు సమాచారం తెలియదన్నారు. బదిలీలపై ఉన్న శ్రద్ధ విధులపై చూపిస్తే బాగుంటుందని మండల వాసులు చర్చించుకుంటున్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు



వైద్య శిబిరంలో పరీక్షిస్తున్న డాక్టర్ కోటేశ్వరరావు



మాచాయపాలెంలో ఎబేట్‌ను పిచికారి చేయిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

బెల్లంకొండ: వర్షా కాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి కె.వి.కోటేశ్వరరావు తెలిపారు. మంగళవారం 'సాక్షి' దిన పత్రికలో 'గ్రామాలను వణికిస్తున్న జ్వరాలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వెంటనే స్పందించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం వైద్య ఆరోగ్య సిబ్బంది మురుగు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఎబేట్ ద్రావణాన్ని పిచికారి చేయించారు. అదేవిధంగా వెంకటాయపాలెం గ్రామంలో జ్వరాలు అధికంగా ఉండడంతో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్న రోగులకు డాక్టర్ కోటేశ్వరరావు వైద్య సేవలు అందించారు. వారి రక్త నమూనాలను సేకరించి పరీక్షలకు పంపారు. ఇంటి పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని వైద్యులు సూచించారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని పేర్కొన్నారు. వైద్య శిబిరంలో హెల్త్ సూపర్వైజర్ బాష, ఎంఎల్‌హెచ్‌పీ ఝాన్సీబాయి, ఏఎన్ఎంలు ఆదిజ్యోతి, సాగరిక, ఆశ కార్యకర్తలు ధనలక్ష్మి, నాగమణి, పద్మ పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తత తప్పనిసరి



కేజీబీవీలో మాట్లాడుతున్న చంద్రశేఖర్



ప్రపంచ దోమల నియంత్రణ దినోత్సవ ర్యాలీ

సత్తెనపల్లి: దోమల వల్ల వచ్చే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సత్తెనపల్లి మలేరియా సబ్ యూనిట్ అధికారి బీపీ చంద్రశేఖర్ అన్నారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయంలో మలేరియా సబ్ యూనిట్ ఆధ్వర్యంలో దోమల వల్ల సంక్రమించే వ్యాధులు, నివారణ చర్యలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చంద్రశేఖర్ మాట్లాడుతూ సర్ రోనాల్డ్ రాస్ అనే బ్రిటిష్ వైద్యుడు హైదరాబాదులో మలేరియా వ్యాధి ఆడ అనాఫిలస్ జాతి దోమ కుట్టడం ద్వారా వ్యాప్తి చెందుతుందని గుర్తించినట్లు చెప్పారు. మలేరియా వ్యాధి నివారణకు, చికిత్సకు కారకులైన వారిని స్మరించుకొంటూ ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 20ని ప్రపంచ దోమల నివారణ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. వారానికోసారి నీటి నిల్వ పాత్రలను, తొట్లను కచ్చితంగా ఖాళీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపల్ ఎం.ప్రసన్నరాణి, బయాలజీ ఉపాధ్యాయురాలు ఎ.బేబీ భార్గవి, ఏఎస్ఎం సీహెచ్ రాజమ్మ, ఆరోగ్య పర్యవేక్షకులు బి. రోశయ్య, వై.రాజేష్ పాల్, కేవీ నాగ మల్లేశ్వరరావు, ఆరోగ్య కార్యకర్తలు ఎస్ఎం.హుస్సేన్, షేక్ షరీఫ్, కేజీబీవీ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ దోమల దినోత్సవ ర్యాలీ

క్రోసూరు: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వైద్య సిబ్బంది మంగళవారం ప్రపంచ దోమల నివారణ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పీ శివుడు మాట్లాడుతూ మనిషికి దోమల ద్వారా మలేరియా వ్యాప్తి చెందుతుందన్నారు. దోమలు బారిన పడకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా పైడమ్మ తల్లికి బోనాలు



ముప్పాళ్ళ: మండల కేంద్రమైన ముప్పాళ్లలో వేంచేసియున్న శ్రీ పైడమ్మ తల్లి వార్షిక తిరునాళ్ల మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి బోనాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పొంగళ్లు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు



క్రోసూరు: మైనర్లు వాహనాలు నడిపితే చట్టపరమైన శిక్షలు ఉంటాయని ఎస్ఐ ఎం.షఫీ మంగళవారం తెలిపారు. సాయంత్రం ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాలు నడుపుతున్న పలువురు మైనర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మద్యం సేవించి, మితిమీరిన వేగంతో వాహనాలు నడపటం నేరమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు.

బహిరంగ ప్రాంతాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు

నరసరావుపేట రూరల్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ సీఐ పసుపులేటి రామకృష్ణ తెలిపారు. పట్టణ శివారు ప్రాంతాల్లోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలను సేవిస్తున్నారని స్థానికుల నుంచి ఫిర్యాదులు రావడంతో రూరల్ పోలీసులు చర్యలు ప్రారంభించారు. కోటప్పకొండ రోడ్డులోని ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో యువకులు ఎక్కువగా సంచరించే ప్రాంతాలలో రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ సి.హెచ్.కిశోర్‌లు మంగళవారం పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో ముళ్లపొదలు తొలగించడంతో పాటు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. అలాగే కోటప్పకొండ సమీపంలోని కెనాల్ మలుపు వద్ద పిచ్చిమొక్కల పెరిగి రోడ్డు ప్రమాదకరంగా మారడంతో జేసీబీతో పిచ్చి మొక్కలను తొలగించారు. దీంతో పాటు కోటప్పకొండ రోడ్డు జంక్షన్ వద్ద వాహ నా ల తనిఖీ నిర్వహించారు. ద్విచక్రవాహనాలు నడుపుతున్న మైనర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ప్రారంభం



సవరణ ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీవో మురళీకృష్ణ

సత్తెనపల్లి: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో మంగళవారం ప్రారంభించారు. అక్టోబర్ 18 వరకు ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ కార్యక్రమం పక్కాగా నిర్వహించాలని, ఇంటింటా సర్వేతో బూత్ లెవల్ అధికారులు కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పు, తప్పులు సవరణ చేపట్టాలని సత్తెనపల్లి ఆర్డీవో వి.మురళీకృష్ణ సూచించారు. పట్టణంలోని 40వ పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మురళీకృష్ణ మాట్లాడుతూ అక్టోబర్ 29న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయడం జరుగుతుందని, వీటిపై సవరణలు, అభ్యంతరాలకు నవంబరు 28 వరకు స్వీకరిస్తారని, డిసెంబరు 24 లోపు పరిష్కరించడం జరుగుతుందన్నారు. జనవరి 6న తుది ఓటరు జాబితా ప్రచురించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఓటర్లు కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఉన్నారు.

సాంకేతికతను అందించిన రాజీవ్‌గాంధీ



రాజీవ్‌గాంధీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సత్తెనపల్లి: భారతీయ యువతకు సాంకేతికతను అందుబాటులోకి తెచ్చిన ఘనత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకే దక్కుతుందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరి జ్ఞానరాజ్ పాల్ అన్నారు. పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం రాజీవ్‌గాంధీ 81వ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం రైల్వేస్టేషన్ దగ్గరలో ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా జ్ఞానరాజ్ పాల్ మాట్లాడుతూ దేశ ఆరో ప్రధాన మంత్రిగా సేవలందించిన రాజీవ్ గాంధీ మతసామరస్యాన్ని, జాతీయ సమగ్రతను, శాంతిని పెంపొందించడంలో ఆయన కృషికి గుర్తింపుగా ఆగస్టు 20న సద్భావం దీవెనగా 1992 నుంచి జాతీయ స్థాయిలో జరపడం జరుగుతుందన్నారు. సద్భావన అంటే స్నేహం, సామరస్యమన్నారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి మాధంశెట్టి వేదాద్రి, కాంగ్రెస్ నాయకులు చాన్ బాషా, ఆనంద్, శంకర్రావు, శేఖర్, మోహన్‌రావు, మస్తాన్ వలి, హైదర్, సాంబశివరావు, అబ్రహం, శివ, మీసాల శంకర్, బొడ్డేటి రవితేజ ఉన్నారు.

పంట వివరాలు నమోదు చేయించాలి



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏఓ వెంకట నర్సయ్య

రాజుపాలెం: సాగు చేసే ప్రతీ రైతు వేసిన పంటల వివరాలను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి వెంకట నర్సయ్య తెలిపారు. మండలంలోని మొక్కపాడు గ్రామ పొలాల్లో పంట నమోద కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో రైతులతో మాట్లాడుతూ పంటలు నమోదు చేయించుకోవడం వల్ల బీమా పథకం, ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు నష్ట పరిహారం పొందవచ్చని తెలిపారు. ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవచ్చన్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని పొందవచ్చని చెప్పారు. సెప్టెంబర్ 15 లోపు పంట వివరాలను నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు ఎక్కువగా ఉందని, ఇది మొవ్వ ద్వారా కాండంలోకి ప్రవేశించి కాండాన్ని తొలిచివేయడం, ఆకులను తినివేయడం, కండెలోకి వెళ్లి లోపల ఉన్న లేత గింజలను తినడం వల్ల పెరుగుదల తగ్గి దిగుబడి తగ్గుతుందని తెలిపారు. నివారణ చర్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఎస్కే దావూద్, రైతులు పాల్గొన్నారు.

వర్క్‌షాపులతో జూనియర్ డాక్టర్ల ప్రతిభ మెరుగు

ఏపీ ఎంసీ అబ్జర్వర్ డాక్టర్ పీఎస్ఎన్ మూర్తి



వర్క్‌షాపులో పాల్గొన్న డాక్టర్లతో నిర్వాహకులు డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి

నరసరావుపేట: ఆన్‌లైవ్ ఈఎన్‌టీ సర్జికల్ వర్క్‌షాపులను జూనియర్ డాక్టర్లు సద్వినియోగం చేసుకొని తమ ప్రతిభను మరింతగా మెరుగుపర్చుకోవాలని ఏపీ మెడికల్ కౌన్సిల్ అబ్జర్వర్ (ఏపీఎంసీ) డాక్టర్ పీఎస్ఎన్ మూర్తి సూచించారు. స్థానిక కొండవీడు ఈఎన్‌టీ హాస్పిటల్‌లో మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో గత నాలుగురోజులుగా నిర్వహించిన హాండ్స్ ఆన్‌లైవ్ సర్జికల్ వర్క్‌షాప్ ముగింపునకు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు, విశిష్ట అతిథులుగా ఐఎంఏ మాజీ ప్రెసిడెంట్ డాక్టర్ ఏఏవీ రామలింగారెడ్డి, సీనియర్ ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ వై.మధుసూదన్, ఏవోఐ తెలంగాణ ప్రెసిడెంట్ డాక్టర్ శేఖర్‌రెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి వర్క్‌షాపు నిర్వహించినందుకు హాస్పిటల్ ఎండీని అభినందించారు. డాక్టర్ మూర్తి మాట్లాడుతూ ఇప్పుడు నిర్వహిస్తున్న వర్క్‌షాప్ కేవలం మెడికల్ కాలేజీలో తప్ప హాస్పిటల్స్‌లో నిర్వహించరని, ఈఎన్‌టీ విభాగంలో దేశంలోనే ఇటువంటి కార్యక్రమాన్ని ఇప్పటివరకు నిర్వహించలేదన్నారు. కొండవీడు హాస్పిటల్‌లో నిర్వహించటం చొరవ, సాహసంతో కూడుకున్న చర్య అన్నారు. అందుకు డాక్టర్ జగన్‌మోహన్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. దీనికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి నుంచి ఏడుగురు జూనియర్ డాక్టర్లు పాల్గొన్నారు. డాక్టర్లు నరేంద్ర, శ్రీవర్షిని, రామ మోహనరెడ్డి, సుధీర్ చంద్ర, సుధాకర్, బయ్యా సుధీర్, హాస్పిటల్ సీఈవో మస్తాన్ రెడ్డి, డైరెక్టర్ కోటిరెడ్డి, మేనేజర్ మహేష్, అశోక్, ఫార్మసిస్ట్ స్వామి పాల్గొన్నారు.

గ్రామ సభలను విజయవంతం చేయండి



వివరాలు తెలుపుతున్న ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం: జాతీయ ఉపాధి హామీ పథకంలో ప్రజలకు ఉపయోగకరమైన పనులు గుర్తించాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు మేరకు మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో ఉపాధి నిధులతో చేపట్టబోయే పనులపై ఈనెల 23న అన్నీ గ్రామాలో ఉపాధి గ్రామ సభలు నిర్వహించాలన్నారు. ఈ ఉపాధి గ్రామ సభల్లో ప్రజాప్రతినిధులు అధికారులు అందరు సమన్వయంతో ఉండి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 46 రకాల పనులనే చేయడానికి ప్రభుత్వం ఆమోదించిదన్నారు. జాబ్‌కార్డు కల్గిన కుటుంబాలకు వంద రోజుల పని దినాలు కల్పించాలన్నారు. గ్రామస్థాయిలో గురించిన ఉపాధి పనులకు సంబంధించి ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధుల ఆమోదంతో గ్రామసభల్లో తీర్మానాలు చేయాలన్నారు. ఆయనతో పాటు ఏపీవో రామారావులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ త్యాగరామ మందిరం కమిటీ ఎన్నిక

సత్తెనపల్లి: పట్టణ నాయీ బ్రాహ్మణ త్యాగరామ మందిరం నూతన కమిటీ చైర్మన్‌గా పత్తిపాటి హరేకృష్ణ ఎన్నికయ్యారు. పట్టణంలోని మందిరంలో మంగళవారం కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా పిలుట్ల సాంబయ్య, వైస్ చైర్మన్‌గా వెంకట్రావు, సెక్రటరీగా పిలుట్ల సుబ్బారావు, కార్యవర్గ సభ్యులుగా కొమ్మూరి కామేశ్వరరావు, మున్నంగి శివయ్య, అట్లూరి వెంకటేశ్వర్లు, పిల్లుట్ల పెద్దన్న, కె.జగన్నాథం, పి.ఆంజనేయులు, బాబురావు, రామకృష్ణ, అశోక్‌ను ఎన్నుకున్నారు.

జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఆర్థిక సాయం



పెదకూరపాడు: జిల్లా పరిషత్ పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని స్వాంతంత్ర్య దినోత్సవం రోజు ఇచ్చిన హామీ మేరకు స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ లక్ష రూపాయాలు, మాజీ ఎంపీపీ గల్లా బాబురావు రూ.25 వేలు ఆర్థిక సాయాన్ని స్థానిక టీడీపీ నేత, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్తిమళ్ల రమేష్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమణకు మంగళవారం అందించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కోసం దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దాతలు ఇచ్చిన నగదును పాఠశాల అభివృద్ధికి వినియోగిస్తామని రమణ తెలిపారు. ఈ కార్యక్రమం వైఎస్ ఎంపీపీ షేక్ చాంద్ బాషా, బెల్లంకొండ రామగోపాలరావు, మద్దినేని సత్యం, జాగర్లమూడి రఘు, షేక్ ముంతాజ్, గల్లా శివనాగరాజు, షేక్ అజిముల్లా, షేక్ రఫీ పాల్గొన్నారు.